క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు బాలిక



నక్షత్రను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ సతీష్, కానిస్టేబుల్ నారాయణ

అల్లిపురం: తప్పిపోయిన బాలికను టూటౌన్ పోలీసులు సకాలంలో వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన నీలం నక్షత్ర (4) బుధవారం సాయంత్రం నుండి కనిపించకుండా పోయింది. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. సతీష్, కానిస్టేబుల్ నారాయణ విచారణ చేపట్టారు. ఆమెను వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మేయర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్ అధికారి

దాబాగార్డెన్స్: మేయర్ పీలా శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగ వెంకట సాహిత్ గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలపై ఈ నెల 18 నుంచి 23 వరకు నగరంలోని పలు ప్రాజెక్టులను అధ్యయనం చేశారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ వంటి విభాగాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు ఆ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు సాహిత్ మేయర్‌కు వివరించారు.

బాడీబిల్డింగ్ పోటీల విజేతకు అభినందనలు



ప్రవీణ్‌కుమార్‌ను అభినందిస్తున్న కాలనీవాసులు

మద్రిపాలెం: ఐసీఎస్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ సత్తా చాటాడు. ఫిట్నెస్ కేటగిరీలో 18 ఏళ్ల విభాగంలో మూడు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాడు. నగరానికి చేరుకున్న ప్రవీణ్‌కుమార్‌కు కాలనీవాసులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. కేక్ కట్ చేసి పరిసర ప్రాంతాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ముగిసిన సంగీత నృత్యోత్సవాలు



శ్రీ ఖడ్గ తిక్కన నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతిలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటక మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఆఖరి రోజు ప్రదర్శించిన శ్రీ ఖడ్గ తిక్కన నాటకం అందరినీ అబ్బురపరిచింది. కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా క్రిష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి సాయిబాబా నాట్యమండలి సభ్యులు చారిత్రాత్మక పద్యనాటకం శ్రీ ఖడ్గ తిక్కన ప్రదర్శించారు. దీనికి డాక్టర్ పి.వి.ఎస్.క్రిష్ణ రచన, దర్శకత్వం వహించగా 38 మంది నటీనటులు ప్రేక్షకులను నటనతో మైమరిపించారు.

జైబోలో.. గణేష్ మహరాజ్‌కీ

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు



దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన పసుపు గణపతి



విశేష పూజల్లో చింతామణి గణపతి



27వ వార్డు దొండపర్తి రామాలయం వద్ద నిర్వహిస్తున్న వరసిద్ధి వినాయక మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: వినాయక చవితి నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తి శ్రద్ధలతో గణేశుడిని అంతా పూజిస్తున్నారు. వినూత్నంగా వేసిన పందిళ్లు పలువుర్ని ఆకట్టుకుంటున్నాయి. గణనాథుడిని నిలిపిన రోజునే పలువురు నిమజ్జనం చేశారు. శని, ఆదివారాల్లో పలు విగ్రహాలు నిమజ్జనం చేయనున్నారు. వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు, వినాయక మండపాలు భక్తుల్ని ఆకర్షిస్తున్నాయి. జగదాంబ జంక్షన్, యల్లమ్మతోట, సూర్యాబాగ్, మహారాణిపేట, అంగటిదిబ్బ, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, చాకలిపేట, సాలిపేట, అల్లిపురం, రెల్లివీధి, కోటవీధి, పాతనగరం, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పూర్ణామార్కెట్, రామజోగిపేట, దొండపర్తి తదితర ప్రాంతాల్లో నవరాత్రులు నిర్వహిస్తున్నారు.

దిబ్బలపాలెంలో..

జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెంలో యూత్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన పసుపు గణపతి భక్తులను ఆకట్టుకుంటోంది. 5 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన పసుపు గణపతి విద్యుత్ వెలుగుల్లో పలువురిని ఆకర్షిస్తోంది. పూజా సామగ్రి (పసుపు, కుంకుమ, చందనం, హారతి కర్పూరం, అగరబత్తి, గుగ్గిలం, సాంబ్రాణి, దీపపు ఒత్తులు, వక్కలు తదితర పూజా సామగ్రితో రూపుదిద్దుకున్న మండపం భక్తులను ఆకట్టుకుంటోంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు, వచ్చే నెల 3 రాత్రి మహాన్నదానం, 4న దీపారాధన, 5న కుంకుమ పూజలు, 6న స్వామి లడ్డూ వేలం, నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉరికిటి గిరీష్, తాడి శ్రీధర్, చందక ప్రవీణ్, పి. శ్రీనివాసరాజు, కట్టా యశ్వంత్, బండారు లోకేష్‌కుమార్, చిటికిరెడ్డి పవన్‌కుమార్, చందక ప్రభాకర్, అజయ్‌కుమార్, అరవింద్‌కుమార్ (మణి), పడాల సూర్యకుమార్, నార్గాన కల్యాణ్, మణి, పసగాడ రామలింగేశ్వరరావు, కడిమి అనిల్‌కుమార్, డీటీడీసీ శ్రీను, కళాకారుడు చంటి, మన్మథ, గ్రటెడ్డి వరుణ్‌కుమార్, తాటితూరి భానుకుమార్, కడిమి అనీల్‌కుమార్, కసినబోయిన చంద్రశేఖర్, పెద్ద ఎత్తున మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

చింతామణి గణపతి దేవాలయంలో..

స్థానిక సుబ్బలక్ష్మీనగర్‌లో చింతామణి గణపతి దేవాలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామికి సాంప్రదాయ రీతిన అభిషేకాలు నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద శర్మ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు.



కొబ్బరితోట వద్ద కళ్లు తెరిచి, మూస్తూ ఆకట్టుకుంటున్న గణపతి

38వ వార్డు సోల్జర్‌పేటలో..

జీవీఎంసీ 38వ వార్డు సోల్జర్‌పేటలో స్థానిక యువకుల ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాలు వినూత్నంగా నిర్వహిస్తున్నారు. రాయపూర్ కృష్ణ, రాధ రూపంలో విగ్రహం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు చేపల నూకరాజు, ప్రభ, ధనరాజు, ప్రసాద్, అప్పలరాజు స్థానికులు, కమిటీ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

27వ వార్డులో..

జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి రామాలయం వద్ద ఆ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 25 అడుగుల భారీ గణనాథుడిని ఏర్పాటు చేశారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

అశోక్‌నగర్‌లో..

ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అశోక్‌నగర్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో కాలనీవాసులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు సీహెచ్ హర్షిత్, ఇ.రవితేజ మాట్లాడుతూ 11 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీన మహాన్నదానం చేపడతామన్నారు.



సోల్జర్‌పేటలో రాయపూర్ రాధాకృష్ణుల రూపంలో గణేశుడు



అశోక్‌నగర్‌లో కొలువైన గణనాథుడు



వెంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి

వాడవాడలా వినాయక ఉత్సవాలు..

అల్లిపురం: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలో వాడవాడలా వినాయక మండపాలు వెలిశాయి. బహురూపాలలో అలంకరించిన విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొబ్బరితోట వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం కళ్లు ఆర్పుతూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నీలమ్మ వేపచెట్టు వద్ద జీకే ఫౌండేషన్ ఏర్పాటు చేసిన గణేశుడు హేరంబ గణపతిగా దర్శనమిస్తున్నారు. మహారాణిపేట, టూటౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో కూడా గణపతి పూజలు జరుగుతున్నాయి.

అయ్యో వినాయక..

గోడ కూలి వినాయక మండపాలు ధ్వంసం



థాంక్స్ బాయ్స్ వేసిన పందిరి సెట్ కూలిపోయినా చెక్కు చెదరని వినాయక విగ్రహం



మరో మండపం కూలిపోయినా సురక్షితంగా ఉన్న విగ్రహం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలు ప్రాంతానికి చెందిన థాంక్స్ బాయ్స్ కమిటీ వినాయక చవితికి రెండు నెలల ముందుగానే గత ఏడాది మే.. జూన్ మాసాల్లో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ. .భారతదేశం–పాకిస్తాన్ మధ్య ఆపరేషన్ సింధూర్ పేరిట జరిగిన యుద్ధ వాతావరణాన్ని తలపిస్తూ వినాయక మండపం సెట్ వేసేందుకు.. అందులో వినాయకుడు..సైనికుల రూపంలో విగ్రహాలను ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి తయారు చేయించారు. పండగ రానే వచ్చింది. ముందురోజు రాత్రంతా మండపం ఏర్పాట్లతో ఆ యువకులు మునిగి తేలారు. మరుసటి రోజున ఆర్డర్ ఇచ్చిన వినాయకుడు.. సైనికుల బొమ్మలను మండపంలోకి తీసుకొచ్చారు. రోజంతా పూజలు జరిపారు. కేరింతలు కొట్టారు. ఎంతో మంది నగర ప్రజలు ఆ సెట్‌ను చూసేందుకు తరలి వెళ్లారు. కుర్రాళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

కొద్ది గంటల్లోనే..

ఉన్నట్టుంటి మండపంపై వెనుక నుంచి పెద్ద గోడ కూలింది. దాంతో మండపం పూర్తిగా ధ్వంసమైంది. అందులో ఉన్న యువకులు (మండప నిర్వాహకులు) మనోహర్, తేజ, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని రక్షించేందుకు వెళ్లిన నానిపై కూడా గోడ కూలడంతో చెయ్యి విరిగింది. అక్కడికి సమీపంలోనే మరి కొంత మంది యువకులు వినాయకుడిని నిలిపారు. ఆ వినాయక మండపంపై కూడా గోడ కూలడంతో ఆ మండపం కూడా ధ్వంసమైంది.



ఇదే ఘటనలో ధ్వంసమైన ఇస్త్రీ బండి

దేవుడు ఉన్నాడు..

10 అడుగులు ఎత్తున.. 50 అడుగుల వెడల్పులో ఉన్న పోలీస్ బ్యారెక్స్ ప్రహారీ కూలిన ఘటనలో రెండు వినాయక మండపాలు ధ్వంసమైనప్పటికీ అందులో ఉన్న వినాయక విగ్రహాలు మాత్రం చెక్కు చెదరలేదు. విగ్రహాలతో పాటు ఏర్పాటు చేసిన సైనికులు.. ఆపరేషన్ సింధూర్ సెట్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంత పెద్ద ఘటన జరిగినప్పటికీ వినాయక విగ్రహాలు చెక్కు చెదరకపోవడంతో దేవుడు ఉన్నాడంటూ స్థానికులు సంతోషపడ్డారు. అయితే ఈ ఘటనలో నలుగురు యువకులు గాయపడడంతో పాటు పలు తోపుడుబళ్లు, బడ్డీలు ధ్వంసమయ్యాయి.

విశాఖ ఉక్కుపై అబద్ధపు ప్రచారం ఆపాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం దూకుడుగా చర్యలు మొదలుపెట్టిందని, ఇప్పటికే 32 విభాగాలను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు పూనుకుందని, కానీ రాష్ట్ర కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం లేదని, యూనియన్లు, కొంత మంది కార్మికులు పని గట్టుకుని ప్రచారం చేస్తున్నారంటున్న అబద్ధపు ప్రచారాన్ని ఆపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, వి.కృష్ణారావుతో కలిసి మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం లేదని, మోదీతో ఎందుకు ప్రకటన చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ కాదని అంటూనే ఈవోఐ పేరిట 32 విభాగాలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడానికి చర్యలు తీసుకున్నారా? లేదా? ప్రజలకు తెలపాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని మోదీ ప్రభుత్వం చెప్పడమే కాక అందుకు అవసరమైన చర్యలన్నీ చేపట్టిందని, ప్లాంట్‌ను రక్షించలేక, కార్మికులు, కార్మిక సంఘాలపైన దుష్ప్రచారానికి పల్లా శ్రీనివాస్ పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

బాలలంతా చక్కగా చదువుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు గురువారం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న పాపా హోమ్ ఫర్ బాయిస్‌ను సందర్శించి ఆశ్రమంలోని బాలల సంక్షేమం, భద్రత, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. చిన్నారులకు న్యాయపరమైన రక్షణ, విద్య, ఆహార వసతులు ఎలా అందుతున్నాయో పరిశీలించారు. పిల్లలకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే ఉచిత న్యాయ సేవలు అందించడానికి డీఎల్ఎస్ఏ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. బాలలందరు బాగా చదువుకుని, మంచి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకాలు, పెన్నుల కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హోమ్ కోశాధికారి రమేష్ చంద్, జయంత్, రహీమున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఎన్జీవోల పాత్ర కీలకం



సమావేశంలో పాల్గొన్న ఎన్జీవో సంస్థల ప్రతినిధులు

సీతంపేట: అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్జీవోల పాత్ర కీలకమని ఎస్ఆర్‌యూ జీవీఎంసీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస రాజమణి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన ఎన్జీవో ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలన్నీ భాగస్వాములు కావాలని కోరారు. తమ సస్టైనబుల్ రెలిజియన్స్ యూనిట్ అందిస్తున్న సేవలను వివరించారు. రిసోర్స్ పర్సన్ సుశాంత్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు ఏవిధంగా సేకరించవచ్చు తెలియజేశారు. కాలేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఏయే పుస్తకాలు నిర్వహించాలి, అకౌంట్స్ నిర్వహణ, ఆడిటింగ్ నిర్వహించడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులపై పనిచేస్తున్న చిట్టిబాబు మాట్లాడుతూ బాలలతో పనిచేస్తున్న సంస్థలు ఏయే రిజిస్ట్రేషన్లు చేయించాలి, అవసరమైన పుస్తకాల నిర్వహణ, ఏయే ప్రభుత్వ శాఖలను సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో వైజాగ్ ఎన్జీవో ఫోరం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు, కార్యదర్శి జె.వి. రత్నం, కోశాధికారి అబ్దుల్ మునీర్, సభ్యులు భాస్కరరావు, డాక్టర్ శశిప్రభ, ప్రకాశరావు, ప్రజ్ఞాన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌ను సందర్శించిన సీపీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

తాటిచెట్లపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గురువారం ఉదయం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ ఉమాకాంత్‌తో కలిసి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, అస్తవ్యస్తంగా ఉన్న వాహనాలను పరిశీలించి ఎప్పటికప్పుడు నిబంధనలకు అనుగుణంగా యజమానులకు అందజేయాలని సూచించారు. సీపీతోపాటు ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ మూర్తి ఉన్నారు.

రచయితకు గ్రహణశక్తి అవసరం

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజం కళాశాలలో గురువారం నిర్వహించిన కథా కచేరీ ఆకట్టుకుంది. పలువురు రచయితలు చదివి వినిపించిన స్వీయ కథానికలు వైవిధ్యభరితంగా అలరించాయి. రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కథా రచయితకు మంచి గ్రహణశక్తి ఉండాలని, కథలో విశ్వజనీనత ఉండాలన్నారు. కథ పేరు చెబితే రచయిత గుర్తుకు రావాలని, ఆవిధంగా ప్రతి రచయిత గుర్తుండిపోయేలా కథలు రాయాలని సూచించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలు జీవిత వాస్తవాలకు ప్రతిబింబాలన్నారు. కథలో శిల్పం చక్కగా ఉండి ఉదాత్తత కలిగి ఉండాలన్నారు. డాక్టర్ సి.హెచ్.నిర్మలాదేవి మాట్లాడుతూ కథలు సంఘటనల నుంచి కూడా పుడతాయని, కథకు స్పందన అవసరమన్నారు. కార్యక్రమంలో రచయితలు రాంభట్ల నృసింహశర్మ, సిహెచ్.చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, సోమంచి వినయ భూషణరావు, కె.వి.ఎస్.మూర్తి, కె.భీమేశ్వరరావు, బి.రాధారాణి, తనికెళ్ల సూర్యకళ, ఆర్.శివాజీ స్వీయ కథలు వినిపించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటిండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

బాబు మోసాలపై ఇంటింటి ప్రచారం



41వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ పూర్ణిమ



35వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కనకరెడ్డి తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ బాబు చేసిన మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. పేదలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలనే చైతన్యాన్ని ప్రజల్లో తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డులో ఆ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బూత్ నంబరు 90లోని పెరికివీధిలో గడప గడపకు వెళ్లి బాబూ మోసాలు వివరించారు. కూటమి ప్రభుత్వ మోసాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్బిరెడ్డి ఆదివిష్ణురెడ్డి, సువార్తరాజు, జీరు సూర్యనారాయణరెడ్డి, మళ్ల బుజ్జి, యాళ్ల రవణమ్మ, నాగిరెడ్డి, రవికుమార్, లక్ష్మణరావు, శేఖర్, నగేష్, నాగార్జున, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు అధ్యక్షుడు మాదబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకుడు పచ్చిరిపల్లి రాము, మహిళా నాయకులు సలాది భాను, హేమ, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, బూరిల చిన్నా, కృష్ణారెడ్డి, ధర్మారావు, సంతోష్‌కుమార్, సత్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరమెట్టపై ప్రచారం చేస్తున్న మాదాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము తదితరులు